నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని
విజయవంతం చేయాలి
● కలెక్టర్ ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, జూన్ 13 : జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం నిర్వహించాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ సూచించారు. గురువారం కలెక్టరేట్ ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా టాస్క్ ఫోర్స్ మీటింగ్‌లో ఈనెల 20 వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని వైద్య ఆరోగ్య, విద్యాశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని సూచించారు.. ఏదైనా కారణాలతో మిగిలిన చిన్నారులకు 27వ తేదీ నమాప్ అప్ డే రోజున వేయించాలని సూచించారు. అంతకుముందు క్షయవ్యాధి నియంత్రణలో భాగంగా అపోలో ఆసుపత్రి నుంచి వచ్చిన చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి రాంబాబును వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం కలెక్టర్ ఉదయ్‌కుమార్ అధ్యక్షతన క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందు కు గానూ కన్వీనర్‌గా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సుధాకర్‌లాల్ వ్యవహరించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, వైద్య ఆరోగ్యశాఖాధికారి సుధాకర్‌లాల్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రవికుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాసు, జిల్లా విద్య, సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు
నిధులు మంజూరు
● కలెక్టర్ ఉదయ్‌కుమార్

ఉప్పునుంతలలో విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

ఉప్పునుంతల, జూన్ 13 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం లక్ష రూపాయలు తక్షణమే మంజూరు చేశామని కలెక్టర్ ఉదయ్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, బాలుర ప్రాథమిక పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియాల్లో మెరుగైన విద్యను అందిస్తున్నారని గ్రామీణ ప్రాంత ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. మండలంలోని 32 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం తక్షణమే నిధులను విడుదల చేయడం జరుగుతుందని, అందుకు కావాల్సిన ప్రతిపాదనలను పంపించాలని పీఆర్ ఏఈ సందీప్‌రెడ్డికి సూచించారు. గత ప్రభుత్వం మన ఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా మండలంలో 13 పాఠశాలలను ఎంపిక చేయగా 11 పాఠశాలల్లో పనులు చేశారని, ఉప్పునుంతల, లక్ష్మాపూర్ పాఠశాలల్లో పనులు ప్రారంభించాలని సూచించారు. మండలంలోని పాఠశాలల్లో పెండింగ్ పనులను తక్షణమే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయా పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రామారావు, ఇన్‌చార్జి ఎంపీడీవో బాలచందర్ సృజన, తాసీల్దార్ శ్రీకాంత్, హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, ఆర్ఐ రాజేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

నిబంధనల మేరకు
మిల్లులను నిర్వహించాలి
● కల్వకుర్తి ఆర్డీవో శ్రీను

కల్వకుర్తి రూరల్, జూన్ 13 : ప్రభుత్వ నిబంధనల మేరకు రైస్‌మిల్లులను నిర్వహించాలని నిబంధనలకు విరుద్ధంగా రైస్ మిల్లులను నిర్వహిస్తే చర్యలు తప్పవని కల్వకుర్తి ఆర్డీవో శ్రీను అన్నారు. గురువారం కల్వకుర్తి పట్టణంలోని పలు రైస్ మిల్లులను తాసీల్దార్ ఇబ్రహీంతో కలిసి ఆర్డీవో ఆకస్మిక తనిఖీ చేశారు. రైస్ మిల్లుల్లో ధాన్యం నిల్వలను పరిశీలించి మిల్లులకు సీఎంఆర్ ఎంత కేటాయించారో వాటిలో నుంచి ప్రభుత్వానికి ఎంత అప్పగించారో అధికారులను అడిగి తెలుసుకున్నారు. మిల్లర్లు ప్రభుత్వానికి అధికారులకు సహకరించాలన్నారు.

కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వే

మిషన్‌భగీరథ సర్వే చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

కల్వకుర్తి రూరల్, జూన్ 13 : గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న శుద్ధ జలాలను పొదుపుగా వాడుకోవాలని కల్వకుర్తి మండలంలోని ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు కోరారు. గురువారం కల్వకుర్తి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు మిషన్‌భగీరథ సర్వేను నిర్వహించారు. ప్రతి ఇంటివద్దకు పంచాయతీ కార్యదర్శులు వెళ్లి మిషన్ భగీరథ నీటి సరఫరా, నల్లా, ఇంటి యజమాని ఆధార్, నీటి సరఫరాలో సమస్యలు పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు.

'దుర్భరంగా టైలర్ల జీవితం'
కొల్లాపూర్, జూన్ 13 : రెడీమేడ్ దుస్తులు వచ్చిన తర్వాత టైలర్ల జీవితం దుర్భరంగా మారిందని మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు కట్టా శ్రీనివాసులు అన్నారు. జాతీయ కుట్టుమిషన్ దినోత్సవం సందర్భంగా సీనియర్ టైలర్లను గురువారం ఆయన శాలువాలతో సన్మానించారు. ప్రభుత్వం టైలర్లకు వడ్డీ లేని వ్యక్తిగత రుణాలు రూ.5లక్షల వరకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టైలర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటస్వామి గౌడ్, వెంకటస్వామి నాయుడు, దినేశ్, పాషా, మధు పాల్గొన్నారు.

గురుకులాలకు
సొంత భవనాలు నిర్మించాలి

ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కొల్లాపూర్, జూన్ 13 : గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలని బీఆర్ఎస్వీ, బీఎస్ఎఫ్ నాయకులు శేఖర్, దాసు డిమాండ్ చేశారు. కొల్లాపూర్ పట్టణంలోని బీసీ గురుకుల పాఠశాల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి గురువారం నిరసన వ్యక్తం చేశారు. వీపనగండ్లకు చెందిన ఎస్సీ గురుకుల హాస్టల్‌కు సొంత భవనం లేకపోవడంతో కొత్తకోటలో నిర్వహిస్తున్నారని అందుకని వెంటనే ఎస్సీ గురుకుల హాస్టల్‌ను కొల్లాపూర్ నియోజకవర్గానికి మార్చాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలల్లో ఉన్న సమస్యలను పరిష్కారం చేయకుంటే విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురుకులాల బోర్డును ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య
నాగర్‌కర్నూల్‌టౌన్, జూన్ 13 : ఉరేసుకొని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు బొందలపల్లికి చెందిన అశోక్‌రెడ్డి(25) నాలుగు నెలల కిందట నాగర్‌కర్నూల్‌లో బట్టల దుకాణం పెట్టుకొని జీవనం సాగిస్తుండేవారు కాగా బుధవారం రాత్రి అదే దుకాణంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ జిల్లా దవాఖానకు తరలించారు. మృతికి గల కారణాలను తెలియాల్సి ఉంది.

తాళం వేసిన ఇంట్లో చోరీ
అచ్చంపేటటౌన్, జూన్ 13 : అచ్చంపేటలోని సాయినగర్ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. అచ్చంపేట పట్టణ ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని సాయినగర్ కాలనీలో రాజుకు చెందిన ఇంటికి తాళం వేసి ఉండడంతో బుధవారం రాత్రి ఇంట్లోకి చొరబడి కొంత నగదు, టీవీని అపహరించుకుపోయారు. చుట్టుపక్కల వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ నిర్వహించి వివరాలు వెల్లడిస్తామని ఎస్సై తెలిపారు.

పోస్టుమెన్‌పై ఫిర్యాదు
వెల్దండ, జూన్ 13 : మండలంలోని పెద్దాపూర్ గ్రామ పోస్టుమెన్‌పై గ్రామస్తులు గురువారం ఫిర్యాదు చేశారు. పోస్టుమెన్ రామ్మోహన్ తమ పేరిట వచ్చిన లెటర్లను తమకు ఇవ్వకుండ తన వద్దే ఉంచుకొని తిరిగి వాపస్ పోవడానికి కారణమయ్యాడని గ్రామానికి చెందిన పోలె రాజు, తక్కలపల్లి శేఖర్, కాటిక రామస్వామి గురువారం ఆరోపించారు. దీంతో మండల తపాల అధికారికి వారు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

తిమ్మినోనిపల్లి రహదారికి మరమ్మతులు
వెల్దండ, జూన్ 13 : మండలంలోని తిమ్మినోనిపల్లిలో రహదారికి గ్రామ పంచాయతీ కార్యదర్శి నవనీత గురువారం మరమ్మతులు చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దొంగరోడ్డు నుంచి గ్రామం వరకు చాలా చోట్ల రోడ్డు గోతులుగా మారాయి. గమనించిన కార్యదర్శి మట్టి పోయించి రోడ్డును చదును చేయించారు. గ్రామస్తులు కార్యదర్శికి అభినందనలు తెలిపారు.

నలుగురికి జైలు శిక్ష
కల్వకుర్తి రూరల్, జూన్ 13 : కల్వకుర్తి పట్టణంలోని ఆయా కాలనీల్లో ఆరు నెలల వ్యవధిలో చోరీకి పాల్పడిన నలుగురికి జైలుశిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానాను కల్వకుర్తి మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ న్యాయమూర్తి కావ్య గురువారం విధించినట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. దొంగతనాలకు పాల్పడే వారికి కఠినంగా శిక్షింపబడతారని ఎస్సై పేర్కొన్నారు.

నేత్రవైద్య శిబిరం పరిశీలన
వంగూరు, జూన్ 13 : మండలంలోని పొల్కంపల్లిలో శంకర కంటి వైద్య దవాఖాన చెన్నై వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గురువారం డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్ సందర్శించారు. కంటి వైద్య శిబిరంలో 955 మంది కంటి వైద్య పరీక్షలు నిర్వహించగా ఆయన నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉజ్వల భవిష్యత్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కుమార్ దీపక్

అచ్చంపేటరూరల్, జూన్ 13 : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని నాగర్‌కర్నూల్ (స్థానిక సంస్థలు) అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. గురువారం మండలంలోని సుల్జాల, హాజీపూర్, నడింపల్లి పాఠశాలలను ఆయన పరిశీలించి ఉపాధ్యాయులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సకాలం లో యూనిఫాం, పాఠ్య, నోట్ పుస్తకాలు అందించారా అని విద్యార్థులను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించే విధం గా ప్రణాళికలను రచించి వాటిలో తల్లిదండ్రులను భాగస్వాములను చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల నెలవారి ప్రగతిపై తల్లిదండ్రులతో తప్పనిసరి సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీవో బాలచందర్ సృజన్, ఎంఈవో రామారావుతోపాటు ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

పశువధ చేయొద్దు
బిజినేపల్లి, జూన్ 13: పశువధ చేయరాదని జిల్లా వెటర్నరీ అధికారి రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని మంగనూర్‌లో బక్రీద్ సందర్భంగా ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును సందర్శించారు. అలాగే బిజినేపల్లి సంతను కూడా పరిశీలించారు. బక్రీద్ పండుగను పురస్కరించుకొని పశువధ జరగకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ
పెంట్లవెల్లి, జూన్13 : మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం ఏవో రమేశ్, ఎస్సై రామన్‌గౌడ్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, రసాయన మందులను పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ డీలర్లు ప్రతిషాపులో ధరల పట్టికను ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్లు, నిల్వలను పరిశీలించారు.

రైతు బంధు ఇస్తరా లేదా?
● మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆగ్రహం

సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ఉమామహేశ్వరి

పెంట్లవెల్లి, జూన్ 13 : యాసంగి సీజన్‌లో 5ఎకరాలు దాటిన రైతులకు సక్రమంగా రైతు బంధు డబ్బులు రాలేవని, ఈ వానకాలంలోనైనా రైతుబంధు డబ్బులు సక్రమంగా ఇస్తరా..లేదా అంటూ కొండూరు, మల్లేశ్వరం ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, ఈశ్వరికుమారి సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు శాఖలకు చెందిన అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఏఈవో ప్రగతి నివేదిక చదివి వినిపిస్తుండగా సభ్యులు కలుగ జేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా రైతులకు పంట పెట్టుబడి సాయం కింద ఎకరాకు ప్రతి ఏడాది రూ.15వేలు ఇస్తామని మాయమాటలు చెప్పి మోసం చేసిందని మండిపడ్డారు. రూ.15వేలు దేవుడెరుగు...కనీసం కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చినట్లుగా రూ.10వేలు ఇస్తే చాలన్నారు. అనంతరం ఎంపీపీ ఉమామహేశ్వరి మాట్లాడుతూ..ఇదే చివరి సర్వసభ్య సమావేశమని మండలాభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

సర్వసభ్య సమావేశానికి అధికారులు డుమ్మా..

మండల సర్వసభ్య సమావేశానికి వివిధ శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. మొత్తం 23శాఖలకు గానూ కేవలం 9శాఖలకు చెందిన అధికారులు మాత్రమే హాజరు కావడంపై ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన అంటూ..సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసన్న కుమారి, తాసీల్దార్ హిమబిందు, సింగిల్ విండో చైర్మన్ విజయరామారావు, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, జిల్లా కోఆప్షన్ సభ్యులు మతీన్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మెన్‌పేట చెరువు తూం పనులు పూర్తి

తూం వద్ద పనులు చేస్తున్న రైతులు

బల్మూరు, జూన్ 13 : మండలంలోని తుమ్మెన్‌పేట ఊరచెరువు తూం పనులను గురువారం పూర్తి చేసినట్లు మాజీ ఉపసర్పంచ్ సురేశ్, మాజీ వార్డు సభ్యులు అనిల్‌గౌడ్, శ్రావణ్‌రావు, రాజు, యాదగిరి తెలిపారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ ఆదేశాల మేరకు పది రోజుల కిందట చిన్ననీటి పారుదల శాఖ ఏఈ సందీప్‌రెడ్డి చెరువు తూంను పరిశీలించి తూంకు షెటర్ బిగించడంతో పాటు కాంక్రిట్ పనులు చేయించారు. అదేవిధంగా చెరువు అభివృద్ధి పనుల కోసం రూ.31లక్షల ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించినట్లు ఏఈ తెలిపారు. వానలు రాకముందే తూం పనులు చేయించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్‌హెచ్-167కే పూర్తి చేయించాలి
● బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు

కేంద్ర మంత్రి నితీన్ గడ్కరీని కలిసిన సుధాకర్

కొల్లాపూర్, జూన్ 13 : ఎన్‌హెచ్-167కేతో కొల్లాపూర్ రూపురేఖలు సమూలంగా మారుతున్నాయని అందుకు సహకరించిన కేంద్రమంత్రి నితీన్ గడ్కరీకి కొల్లాపూర్ ప్రజల తరపున ధన్యావాదాలు తెలిపినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్ రావు తెలిపారు. బుధవారం కేంద్రమంత్రిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన గడ్కరీని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. సోమశిల సిద్ధేశ్వరం వంతెన నిర్మాణం కూడా త్వరగా పూర్తయ్యేవిధంగా చూడాలని కోరారు.

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి
పెంట్లవెల్లి, జూన్ 13 : మండల కేంద్రం సమీపంలోని సర్వే నెంబర్ 22, 27లలో ఉన్న 14ఎకరాల ప్రభుత్వ భూమిలో ఇండ్లు లేని పేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ఆధ్వర్యంలో గురువారం తాసీల్దార్ హిమబిందుకు వినతిపత్రాన్ని అందజేశారు. అంతకుముందు ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్వర్యంలో మండల కేంద్రానికి చెందిన ఇండ్లు లేని దళితులతో కలిసి తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల కేంద్రంలో ఇండ్లు లేని పేదలను ప్రజాపాలన దరఖాస్తుల ద్వారా గుర్తించి ఇండ్ల స్థలాలు కేటాయించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు హన్మంతు, తిమ్మస్వామి, గోపాల్, రాజు, లక్ష్మి, పద్మ, మహిమూద్, లావణ్య, శ్యామలమ్మ, సురేశ్, రామకృష్ణ, రమణమ్మ, గుండమ్మ ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
చారకొండ, జూన్ 13: గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేక అధికారి చిన్నహుస్సేన్ అన్నారు. గురువారం మండలంలోని మర్రిపల్లిలో గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వ్యక్తిగత శుభ్రతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. అదేవిధంగా మిషన్ భగీరథపై నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేకు సహకరించాలని కోరారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రవిశంకర్ పాల్గొన్నారు.

నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలి
నాగర్‌కర్నూల్, జూన్ 13: అసంక్రమిత వ్యాధుల నిర్ధారణలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా వైద్యాధికారి సుధాకర్ లాల్ అన్నారు. గురువారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అసంక్రమిత వ్యాధుల స్క్రీనింగ్, ఆన్‌లైన్‌లో నమోదుపై ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, పర్యవేక్షణాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదుచేసి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటదాసు, బీమానాయక్, ప్రోగ్రాం అధికారి రవికుమార్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులు
ఆందోళన చెందొద్దు
● మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

కల్వకుర్తి, జూన్ 13 : కల్వకుర్తి మున్సిపాలిటీలో కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నారు. డబుల్ బెడ్రూం ఇండ్లపై లబ్ధిదారులు ఆందోళనకు గురవుతున్న నేపథ్యంలో మున్సిపల్ చైర్మన్ స్పందించారు. కేసీఆర్ ప్రభుత్వం కల్వకుర్తి మున్సిపాలిటీలో 240 డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించిందని తెలిపారు. గత సంవత్సరం కలెక్టర్ ఆధ్వర్యంలో లక్కీడ్రా ద్వారా డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేసిన విషయాలను మున్సిపల్ చైర్మన్ గుర్తు చేశారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లు అప్పగించకుండా నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిబంధనలు పాటిస్తూ లక్కీడిప్ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసిన విషయాలను సదరు నాయకులు గుర్తించుకోవాలని హితవు పలికారు. ఈ విషయంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకే ఇండ్లను అప్పగిస్తారని ఆయన చెప్పారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత
తిమ్మాజిపేట, జూన్ 13 : మండల కేంద్రంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. మండల కేంద్రంలో ఇంటింటి నుంచి సేకరించిన 7 క్వింటాళ్ల బియ్యాన్ని వనపర్తి సమీపంలోని మదనాపురానికి ఆటోలో తరలిస్తుండగా సివిల్‌సప్లయర్స్ అధికారులు పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. రూ.8లకు కిలో చొప్పున రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుకున్న లక్ష్యాలను సాధించాలి
బిజినేపల్లి, జూన్13: విద్యార్థులు ప్రణాళికతో చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం బిజినేపల్లి, పాలెం గ్రామాల్లో గల పాఠశాలలో పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ప్రస్తుతం ఇప్పుడు ఉన్నతస్థాయిలో ఉన్న వారంతా ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారే అని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏవో భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చంద్రకళ, రాజు ఉన్నారు.

ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, విత్తనాలు అమ్మాలి
బిజినేపల్లి, జూన్ 13 : ఫర్టిలైజర్ డీలర్లు రైతులకు ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని ఏడీఏ రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని పాలెంలో శ్రీరాజనారాయణ ఫర్టిలైజర్, బిజినేపల్లిలోని కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఆగ్రో రైతు సేవా కేంద్రం శ్రీవెంకటేశ్వర ఫర్టిలైజర్, భాగ్యలక్ష్మి ఏజెన్సీ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం పత్తి విత్తనాల శాంపిళ్లను సేకరించి ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో ఏవో నీతి, ఏఈవో ఫరీద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కొల్లాపూర్‌లో విత్తన దుకాణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు
కొల్లాపూర్, జూన్ 13 : రైతులకు నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ రవికుమార్ విత్తన దుకాణాల యాజమానులను హెచ్చరించారు. ఏవో రమేశ్, కొల్లాపూర్ ఎస్సై రిషికేష్‌తో కలిసి ఆయన కొల్లాపూర్ పట్టణంలోని రాఘవేంద్ర ఫర్టిలైజర్స్, శబరి ఫర్టిలైజర్స్, కురుమూర్తి ఫర్టిలైజర్స్, వెంకటేశ్వర రైతు సేవా కేంద్రం, మన గ్రోమోర్, కార్తికేయ ట్రేడర్స్ షాపులను తనిఖీ చేశారు. తనిఖీల్లో విత్తనాల లైసెన్స్, స్టాక్ బోర్డుల రికార్డులను పరిశీలించారు.

రైతులకు అందుబాటులో ఎరువులు
● పీఏసీసీఎస్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి

మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

కల్వకుర్తి, జూన్ 13 : కల్వకుర్తి పీఏసీసీఎస్‌లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని పీఏసీసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం కల్వకుర్తి పీఏసీసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కల్వకుర్తి పీఏసీసీఎస్ పరిధిలో కల్వకుర్తి, ఊర్కొండ మండలాల్లో యాసంగికి సంబంధించి 1,386 మంది రైతుల నుంచి 97,038 క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు చేశామన్నారు. పీఏసీసీఎస్ గోదాంలో రైతులకు విక్రయించేందుకు ఎరువుల బస్తాలు అందుబాటులో ఉన్నాయని, యూరియా 937 బస్తాలు ఉన్నాయని, బస్తా ధర రూ.266.50, కాంప్లెక్స్ 28:28:0 ఎరువులు 280 బస్తాలు ఉన్నాయని ధర రూ.1680, 20:20:0:13 ఎరువుల 560 బస్తాలు ఉన్నాయని, వీటి ధర బస్తాకు రూ.1, 130 ఉందని చైర్మన్ తెలిపారు. రైతు లు తమ ఆధార్, పట్టాదార్ పాసు పుస్తకం జిరాక్స్‌లు ఇచ్చి ఎరువులు కొనుగోలు చేయొచ్చని చెప్పారు. జూలై నుంచి పీఏసీసీఎస్‌లో బంగారు అభరణాలపై రుణాలు ఇస్తున్నామని, ఖాతాదారులకు లాకర్ సదుపాయం అందుబాటులోకి తెచ్చినట్లు చైర్మన్ జనార్దన్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో వైస్‌చైర్మన్ శ్యాం, డైరెక్టర్లు రామునాయక్, వెంకటయ్య, సీఈవో వెంకటేర్‌రెడ్డి ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★SIFEL MINERALS PVT. LTD.
Vacancies at Thirumalaiahpally (V), Bhoothpur, Telangana.
1.Industrial Electrician for Minor Factory Repairs, 2. Accountant for GST Billing, Sales Record maintenance and reporting.
Ph: 9118126666.